బాగా తెలుసు" అన్నారు. కాబట్టి మన ప్రారబ్ధ కర్మ చిట్టాను గురువు కెలికి దెబ్బలు కొట్టించుకోకుండా, బుద్ధిగా వివేకమనే ఊతకర్రను పట్టుకొని వైరాగ్యమనే బాటలో నడిస్తే పవిత్రులమై నిజ గమ్యాన్ని చేరుతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 02-07-05, చింతపర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మనందరం ఈ గ్రామం రావటం జరిగింది. షిరిడీ సాయిబాబా దత్తాత్రేయుడి అవతారం. సర్వదేవతా స్వరూపుడు, కొంతమంది హనుమంతుడి అవతారం అని చెపుతారు. బాబాకు ఉపవాసం అంటే ఇష్టం ఉండదు. అన్నదానం అంటే చాలా ఇష్టం. ఆయన ఎప్పుడూ ఉపవాసం చేసే వారుకాదు, అలాగే మనం ఉపవాసం చేయటం కూడా ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఉపవాసం చేసేవారు ఆయన దగ్గర కూర్చుంటే ఆయనే మిఠాయిగాని, ఏదో ఒకటిగాని తినిపించేవారు. ఆయనకు జీవకోటి అంతా సమానమే. జంతువులు, పక్షులు, మనుషులు అంతా సమానమే. దత్తాత్రేయుడి అవతారాలలో షిరిడీ బాబా అవతారం ఒకటి అని చెపుతారు. దత్తాత్రేయుడి మొదటి అవతారం శ్రీపాదవల్లభస్వామి అని చెపుతారు. పిఠాపురంలో రాజశర్మ, సునీత అనే బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వారు పరమ పవిత్రులు, మంచి భక్తిగలవారు, ఆధ్యాత్మిక చింతన కలవారు, జీవితమంతా దత్తాత్రేయుడి ఉపాసన చేస్తూ ఉండేవారు, ప్రారబ్ధం ఎలా వెంటాడుతుందో చెప్పలేము. రాజశర్మకు, సునీతకు నలుగురు సంతానం కలిగారు, నలుగురు స్వర్గస్థులు అయిపోయారు. కాని వారు దత్తాత్రేయుడి ఉపాసన విడిచిపెట్టలేదు. తరువాత ఇద్దరు కొడుకులు కలిగారు, అందులో ఒకడు గుడ్డివాడు, ఒకడు కుంటివాడు, అయినా వారు దత్తాత్రేయుడి ఉపాసన మానలేదు, అదీ దీక్ష. బాహ్యసంఘటనల పేరు చెప్పి మనం భక్తికి దూరం కాకూడదు, బాహ్యసంఘటనలు అన్నీ స్వప్నంతోటి సమానము. శరీరం జన్మించటంకాని, శరీరం మరణించటంకాని, ప్రారబ్ధం అనుభవించటం కాని ఇదంతా మాయలో భాగాలు. బాహ్యసంఘటనలు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా

ఉన్నా మనం ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకూడదు. సోమరితనానికి అలవాటుపడ్డవారు కోరికలేనివారు అని అర్థంకాదు. కర్మఫలం మీద కాంక్షలేనివాడు ప్రతివాడు కోరికలేని వాడితోటి సమానము, వాడికి ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. బాహ్యంగా వారికి ఎన్ని చెడు సంఘటనలు జరుగుతున్నప్పటికీ రాజశర్మ, సునీతలు దత్తాత్రేయుడి ఉపాసన మానలేదు. మన దేహప్రారబ్దం ఇలా ఉంది కాబట్టి ఇలా జరుగుతోంది అనుకొన్నారు కాని నలుగురు బిడ్డలు చనిపోయినా, ఒకడు కుంటివాడుగా పుట్టినా, ఒకడు గుడ్డివాడిగా పుట్టినా వారు దత్తాత్రేయుడి పాదాలను విడిచిపెట్టలేదు. వారి యొక్క భక్తికి, శీలానికి, శ్రద్ధకు దత్తాత్రేయుడు మెచ్చి, వారిని అనుగ్రహించి, సునీతకు బాలుడిగా దర్శనమిచ్చి, అమ్మా నీకు ఏమి కావాలి అని అడిగాడు. మాకు ఒక్కడూ ఉపయోగపడే బిడ్డ కలుగలేదు, నువ్వు అమ్మా అని పిలుస్తున్నావు, ఈ ముద్దు మాటలు వద్దు, నా కడుపులో పుట్టి అమ్మా అని పిలువు, అదే నా కోరిక అని చెప్పింది. అప్పడు దత్తాత్రేయుడు అలాగే అని చెప్పి, ఆవిడకు ఇచ్చిన మాట ప్రకారం శ్రీపాదవల్లభుడిగా పిఠాపురంలో జన్మించాడు. ఆయన పిఠాపురంలో 16 సంవత్సరాలు పెరిగాడు. అప్పడు తల్లిదండ్రులు ఏమన్నారు అంటే నీకు ఇద్దరు అన్నగార్లు ఉన్నారు, వారు పనికివచ్చేవారు కాదు, అందుచేత నీకు వివాహం చేస్తాము, వంశం నిలబడుతుంది అని చెప్పారు. అప్పడు శ్రీపాదవల్లభుడు తల్లిదండ్రులతో ఏమన్నాడు అంటే అమ్మా నాకు వివాహం అయిపోయింది నీకు తెలియదా అన్నాడు. మరి నీ భార్య ఎవరు అని తల్లి అడిగింది. నా భార్య వైరాగ్యం అని చెప్పాడు. వైరాగ్యం అనే అమ్మాయిని నేను ఎప్పడో పెళ్ళి చేసుకున్నాను, మరి కొత్తగా నాకు వివాహం ఏమిటి అన్నాడు. వైరాగ్యం అనే స్త్రీని ఎవడైతే పెళ్ళిచేసుకున్నాడో వాడికి బాహ్యంగా ఇంక పెళ్ళితోటి పనిలేదు. నీ గర్భాన జన్మించమన్నావు కాబట్టి నీ కోరిక నెరవేర్చటానికి ఈ శరీరం వచ్చింది కాని ప్రారబ్దం ఏమీ లేదు, నీ గర్భాన జన్మించి అమ్మా! అని పిలువమన్నావు, అమ్మా అని పిలిచాను, నీ కోరిక నెరవేర్చాను, అయిపోయింది, ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాను అని చెప్పాడు. అప్పడు తల్లిదండ్రులు ఏమి చెప్పారు అంటే నువ్వు వెళ్ళిపోతాను అంటున్నావు, తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో సేవలు చేయకపోతే ఆ బిడ్డలు ఎందుకు? ఇప్పడు మా పనులు మేము చేసుకొంటున్నాము, నీ సేవ మాకు అక్కరలేదు, రేపు వృద్ధాప్యం వచ్చినప్పడు నీ అన్నగార్లు

చూస్తే ఒకడు కుంటివాడు, ఒకడు గుడ్డివాడు, వారు మాకు సేవచేయటానికి పనికిరారు, నువ్వు ఏదో సేవ చేస్తావు అనుకొంటే నీవు గృహ పరిత్యాగం చేస్తాను అంటున్నావు, మరి మామాట ఏమిటి అని అడిగారు. అమ్మా! అని పిలిస్తే సరిపోతుందా? మరి మాకు సేవ చేయవద్దా? అని అడిగితే అప్పడు శ్రీపాదవల్లభుడు ఏమి చేసాడు అంటే అన్నగార్లలో ఒకడు కుంటివాడు ఉన్నాడు కదా వాడికి కాళ్ళు ఇచ్చేసాడు, గుడ్డివాడికి కళ్ళు ఇచ్చాడు, వీరిద్దరూ భవిష్యత్తులో వివాహం చేసుకొంటారు, మీకు సేవ చేస్తారు, మీ వంశం నిలబడుతుంది. అందుచేత నేను లేనిలోటు మీకు అక్కరలేదు, నేను ఇక్కడ బంధింపబడటానికి రాలేదు, బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా లేకపోయినా మీరు దత్తాత్రేయుడి ఉపాసన విడిచిపెట్టలేదు కాబట్టి మీ కోరిక నెరవేర్చటం కోసం నేను ఇక్కడ అవతరించాను అని చెప్పి తల్లిదండ్రులను ఆశీర్వదించి 16వ సంవత్సరంలో పిఠాపురం విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. అదే దత్తాత్రేయుడి మొదటి అవతారం శ్రీపాదవల్లభుడు అని చెపుతారు. షిరిడీ సాయిబాబా దతాత్రేయుడి అవతారం అని చెపుతారు. మీలో కూడా గొప్ప గొప్ప యోగులు ఉన్నారు. మేము ఒకరింటికి వెళ్ళినప్పడు మీరు బాగున్నారా, శాంతిగా ఉన్నారా అని అడిగాము అంటే ఆవిడ ఏమి చెప్పారు అంటే మాకు ఉండటానికి నీడకు లోటు లేదు, అన్నవస్త్రాలకు లోటులేదు, బాహ్యంగా చూస్తే అన్నీ బాగానే ఉన్నాయి, మీరు శాంతిగా ఉన్నారా అని అడుగుతున్నారు, బాహ్యపరిస్థితులు బాగున్నంత మాత్రంచేత శాంతిగా ఉంటామని మేము అనుకోవటం లేదు, వైరాగ్యం లేని మాకు శాంతి ఏమిటి అంటున్నారు. వైరాగ్యం ఉన్నవారికి శాంతి, వైరాగ్యం ఉన్నవారికి ఏకాంతవాసం, వైరాగ్యం ఉన్నవారికి జ్ఞానం కాని వైరాగ్యం లేని మాకు శాంతి ఏమిటి? అసలు వైరాగ్యం అంటే ఎలా ఉంటుందో మాకు తెలిస్తే కదా శాంతిగా ఉండటానికి. వైరాగ్యం లేనివాడు ఒంటరిగా ఇంటిలో కూర్చున్నా లక్షమందిలో ఉన్నట్లుగా ఉంటుంది, వైరాగ్యం లేనివాడి బుర్ర అంతా సత్రం కింద ఉంటుంది. మాకు వైరాగ్యం లేదు కాబట్టి మాకు శాంతి లేదు అని ఆవిడ చెప్పారు. బాబా గారి భక్తులకు ఆయనే భగవంతుడు, ఆయనే గురువు. మనం రాముడిని, కృష్ణుడిని ఎలాగ ఆరాధిస్తున్నామో అలాగ బాబా భక్తులు బాబాను భగవంతుడిగా ఆరాధిస్తారు. నాకు ఆయన ఆంజనేయస్వామి అంశగా కనిపించారు. కొంతమంది దత్తాత్రేయుడి అవతారం అని చెపుతారు. ఆయన ఏ

అవతారం అయినప్పటికీ ఆయన మహాజ్ఞాని, సిద్ధపురుషుడు, అష్ట సిద్దులు చేతిలో ఉన్నవాడు. బాబాగారికి ఇష్టమైన పండుగ శ్రీరామనవమి, ప్రత్యేకించి చాలా శ్రద్ధ తీసుకొని శ్రీరామనవమి చేసేవారు. మనం దేవాలయాలకు వెళ్లటం, పూజలు చేయటం, అభిషేకాలు చేయటం ఇవన్నీ ఎందుకు అంటే మన బుద్ధిని బాగుచేసుకోవటానికి, మన బుద్ధిని సంస్కరించు కోవటానికే ఇవి అన్నీ చేస్తున్నాము. శాంతిలేనివాడికి సుఖంలేదు. పంచదార ఫ్యాక్టరీలో నుండి పంచదార ఎలా ఉత్పత్తి అవుతుందో అలాగ భక్తిలో నుండి శాంతి, జ్ఞానం, ఆనందం ఉత్పత్తి అవుతాయి. అవతారపురుషులను సేవించటం వలన, అవతారపురుషులను ఆరాధించటం వలన మనకు భక్తి కలుగుతుంది. భక్తి లేకపోతే మనకు శాంతి లేదు, జ్ఞానం లేదు, ఆనందం లేదు. మనం ఏదైనా పనిచేసేటప్పుడు ఆపని మంచిగా ఉండటం ఒక్కటే కాదు, ఆ పని చేసేటప్పుడు నీ సంకల్పం మంచిగా ఉండాలి, అది మన రాబోయే జన్మను నిర్ణయిస్తుంది. అందుచేత మనకు వచ్చే సంకల్పాల విషయంలో, మనకు వచ్చే తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనలో ఉన్న రూపబుద్ధివలన, నామబుద్ధి వలన మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేకపోతున్నాము. ఈ రూపబుద్ధిని బట్టి, నామబుద్ధిని బట్టి మనలో ఏదో ప్రత్యేకత ఉందని, దానిని కాపాడుకోవాలని అనుకొంటున్నాము అదే మన పతనానికి కారణం అవుతోంది. మనం ఏ దేవుడిని ఆరాధించినా, ఏ గురువును ఆశ్రయించినా ఈ రూపబుద్ధి, నామబుద్ధి కరగాలి. ఈ రూపబుద్ధి, నామబుద్ధి కరగకపోతే మన మనస్సు గూటిలో పడదు. మనస్సు ఎక్కడనుండి అయితే వచ్చిందో అక్కడకు వెళ్లి అణిగితేనేగాని, అక్కడ కరిగిపోతేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం కలిగితేగాని ఆత్మశాంతి లేదు, ఆత్మానందం లేదు. మనస్సు బయటకు వెళితే అశాంతి, లోపలకు వెళితే శాంతి. మనస్సు బయటకు వెళితే దుఃఖం, లోపలకు వెళితే సుఖం. సోదర మహాశయులారా! ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి మీరు పాండిత్యం సంపాదించండి, మీరు కోట్లాది రూపాయలు డబ్బు సంపాదించండి, లేకపోతే మీరు గొప్పగొప్ప పదవులు సంపాదించండి అయినా మీరు అజ్ఞానంలో ఉన్నట్లే గుర్తు. ఇదంతా స్వప్న సమానము. మీరు సంపాదించిన డబ్బు, పాండిత్యం, పదవులు, గౌరవాలు అన్నీ బయటే ఉన్నాయి కాని నీవు బయటలేవు లోపలే ఉన్నావు అది మనం మర్చిపోతున్నాము. మీకు పాండిత్యం ఉండవచ్చుకాని మీరు పాండిత్యం

కాదు. మీ ప్రారబ్ధాన్ని బట్టి మీకు డబ్బు రావచ్చు కాని మీరు డబ్బు కాదు, మీకు పదవులు ఉండవచ్చు కాని ఆ పదవులు మీరు కాదు. ఈ గౌరవాలు, డబ్బు, అధికారం, పదవులు, పాండిత్యం అన్నీ కూడా మనకు బయట ఉన్నాయి కాని లోపల లేవు. మనం లోపల ఏదిగా ఉన్నామో అదిగానే ఉన్నాము. ఏ వస్తువుకయితే మరణం లేదో, ఏ వస్తువుకయితే పుట్టుకలేదో, ఏ వస్తువు అయితే ఎప్పుడూ ఉంటుందో, దేని స్వరూపం అయితే శాంతో, ఆనందమో అది నీ హృదయంలోనే ఉంది, నీలోపలే ఉంది. దానిని వదిలేసి ఎక్కడో ఏదో సంపాదిస్తాను, గౌరవం సంపాదిస్తాను, డబ్బు సంపాదిస్తాను అంటావు ఏమిటి? నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక అనుభవం పొందటం నీకు ముఖ్యం, ముందు దానిని సంపాదించు. అప్పటివరకు నీవు మాయలోనుండి బయటకు రాలేవు. మనం కాలేజీకి వెళ్ళి చదువుకోవచ్చు, బయటకువెళ్ళి ఉద్యోగాలు చేయవచ్చు, దానివలన పొట్ట వెళ్ళిపోతుంది, ఆ చదువులు అన్నీ కూడా అవిద్యా మార్గాలే, అజ్ఞాన మార్గాలే. సర్వకాల సర్వావస్థలలో మార్పు లేకుండా, పరిణామసిద్ధాంతానికి లోనుకాకుండా ఏ వస్తువు అయితే స్వతంత్రంగా, సహజంగా ఉందో ఆ వస్తువును పొందటానికి నీవు ప్రయత్నం చేస్తున్నప్పుడు నీవు విద్యామార్గంలో ఉన్నావు, మిగిలినవి అన్నీ కూడా అవిద్యా మార్గాలే. నాకు బాగా పాండిత్యం ఉంది అనుకోండి సభలో సన్మానం చేస్తారు, గౌరవిస్తారు, భోజనాలు పెడతారు. ఈ ప్రపంచం ఎంత నిజమో, ఈ పంచభూతాలు ఎంత నిజమో, ఈ మనస్సు ఎంత నిజమో ఈ గౌరవాలు, అగౌరవాలు కూడా అంతే నిజం. ఇదంతా అవిద్యా మార్గమే. ఈ అవిద్యామార్గంలో నుండి, అజ్ఞానమార్గంలో నుండి నిన్ను విద్యామార్గంలోనికి, జ్ఞానమార్గంలోనికి ఎవడైతే మళ్ళిస్తున్నాడో వాడే గురువు, గురువు అనిపించుకోవటానికి వాడు మాత్రమే అర్హుడు. మీ తల్లిదండ్రులు అన్నం పెడతారు, బట్టలు ఇస్తారు. కాని అజ్ఞానమార్గంలోనుండి జ్ఞానమార్గంలోనికి, అవిద్యా మార్గంలో నుండి విద్యామార్గంలోనికి మళ్ళించి ఏ వస్తువు అయితే మీకు, నాకు, ఈ జీవకోటికి ఆధారంగా ఉందో ఆ వస్తువువైపుకు మీ మనస్సును, ఇంద్రియాలను ఎవడైతే మళ్ళిస్తాడో వాడే గురువు, వాడే జ్ఞాని. మనం చేసే పని వలన రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకోకూడదు, చేసే పని వలన రూపబుద్ధి, నామబుద్ధి తగ్గుతూ ఉండాలి, అదే సాధన. శత్రువుల పట్ల, మిత్రుల పట్ల సమానంగా ఉండు అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఎందుచేతనంటే మీరు మిత్రుల

పట్ల అతిగా ఉన్నా, శత్రువులను అతిగా ద్వేషించినా దానివలన మీరు స్వరూపానికి దూరమవుతారు. బయటఉన్న మనుషులతోటి, బయటఉన్న వస్తువులతోటి, లోకంతోటి మీరు మానసికఅనుబంధం పెట్టుకోవద్దు. మనం చేసేపని ద్వారా కూడా మనం భగవంతుడిని ఆరాధించాలి. మీరు చేసే పని ద్వారా మీరు భగవంతుడిని ఆరాధిస్తూ ఉంటే మీకు పని పూర్తి అవుతుంది, మీ కుటుంబం బాగుపడుతుంది, దేశం బాగుపడుతుంది. బయట వ్యక్తులతోటి, వస్తువులతోటి మానసికఅనుబంధం పెట్టుకోవటం వలన రాబోయే జన్మలు పెరుగుతాయి, ఈ జీవుడికి ప్రయాణాలు పెరుగుతాయి. కొన్ని షిరిడీబాబా దేవాలయాలలో ధుని పెడతారు. ధుని 24 గంటలు కాలుతూ ఉంటుంది, ఆ ధునిలో నుండి విభూతి వస్తుంది. బాబా చెప్పేది ఏమిటి అంటే ఆ పుల్లలు అగ్నిహోత్రంలో ఎలా కాలుతున్నాయో అలాగ నీ అజ్ఞానాన్ని, నీ స్వార్థాన్ని, నీ వ్యక్తిభావనను అగ్నికి ఆహుతి చెయ్యి అదే బాబా సందేశం. శవబుద్ధి విడిచిపెట్టకుండా శివబుద్ధి రాదు. నీకు ఉన్న శవబుద్ధిని అగ్నికి ఆహుతి చెయ్యి. మన బాహ్యపరిస్థితులు చూస్తే పూర్వం కంటే ఇప్పడు బాగా ఉన్నాయి కాని ఎంతమంది శాంతిగా ఉన్నారు, ఎంతమంది ఆనందంగా ఉన్నారు. బాహ్య పరిస్థితుల మీద మన శాంతి, ఆనందం ఆధారపడి లేదు. మనలను మనం సంస్కరించు కోవటానికి, మన బుద్ధిని బాగుచేసుకోవటానికి ఈ దేవాలయాలు, యజ్ఞాలు, యాగాలు ఇవిఅన్నీ కూడా అందుకే, మనం చదువు అభివృద్ధి చేసుకోవటానికి చూస్తాము, డబ్బు అభివృద్ధి చేసుకోవటానికి చూస్తాము కాని మన బుద్ధిని బాగుచేసుకోవటానికి మనం ఏమీ ప్రయత్నం చేయము, అదే మాయ. బుద్ధి పాడయిపోయిన తరువాత నీకు ఎన్ని ఉంటే ఏమి లాభం అంటున్నాడు భగవంతుడు. భగవంతుడిని నోటి ద్వారా ఆరాధించాలి, భగవంతుడిని చేతి ద్వారా ఆరాధించాలి. ఒక భక్తుడికి చేతులు లేవు, కాళ్ళు లేవు. భగవంతుడు కనిపించి నీకు చేతులు కావాలో, కాళ్ళు కావాలో కోరుకో, ఈ రెండింటిలో ఒకటి కోరుకో ఇస్తాను అంటాడు. నాకు కాళ్ళు వద్దు, చేతులు ఇయ్యి అంటాడు ఆ భక్తుడు. అదేమిటి కాళ్ళు అయితే నడవటానికి బాగుంటుంది కదా, నీవు కాళ్ళు వద్దు చేతులు ఇవ్వమంటున్నావు ఏమిటి అని అడిగితే చేతులు అయితే నీ పాదాలకు పూజ చేయటానికి పనికి వస్తాయి అందుచేత చేతులు ఇవ్వమంటున్నాను అని చెప్పాడు. అది భక్తుడి లక్షణం.

గమ్యం కంటే సాధన గురించి బాబా ఎక్కువగా చెప్పేవారు. ఆత్మగుణాలను, కళ్యాణ గుణాలను అలవర్చుకోండి. అసూయ లేకుండా ఉండటం, మీ పని మీరు శ్రద్ధగా చేసుకోవటం, ప్రతీ చిన్న సంఘటనకు రియాక్టు అవ్వకుండా ఉండటం, శాంతిగా, ఓర్పుగా ఉండటం, ఇతరులను ఎలా హింసపెట్టకూడదో అలాగ నీ మనస్సును నీవు హింస పెట్టుకోకుండా ఉండటం ఇవి అన్నీ కళ్యాణగుణాలు, వీటిని మనం అలవర్చుకోవాలి. నిస్పృహ మంచిది కాదు కాని అస్పృహ మంచిదే అని బాబా చెప్పారు. అస్పృహ అంటే నువ్వు చేసినా చెయ్యని వాడితోటి సమానంగా ఉండాలి. అంటే నీవు ఏదైనా మంచి పని చేసావు అనుకో, దానితో నీకు మానసిక అనుబంధం ఉండకూడదు, దానిని నీవు మర్చిపోవాలి. నువ్వు మంచి పని చేసావు అనుకో దానిని నీ తలమీద మోయకూడదు, దాని తాలుక స్పృహ నీకు రాకూడదు. భగవంతుడు నీకు ఏదైనా బహుమానం ఇవ్వాలంటే ఇస్తాడు, అది నీ శిరస్సు మీద మటుకు మొయ్యకూడదు, చేసి మర్చిపోవాలి. కొంతమంది కాఫీ ఇచ్చి స్మశానానికి వెళ్ళేవరకు దానిని మోస్తూ ఉంటారు, అది మంచిది కాదు. అస్పృహ చేతకాకపోతే నేర్చుకో. నాకు చేతకాదు అని కూర్చోవద్దు, నేర్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. వర్తమాన కాలం నీ చేతిలో ఉంది కదా ప్రాక్టీసు చెయ్యి, కొంతమంది మాకు భగవంతుడిని స్మరించటం అసలు అలవాటు లేదు అని చెపుతారు, పోనీ పూర్వం అలవాటు లేకపోతే ఇప్పుడు నేర్చుకో, పనికివచ్చే లక్షణాలను నేర్చుకో, ఆత్మగుణాలను అభివృద్ధి చేసుకో. నీవు ప్రకృతిగుణాలలో ఉంటే ప్రకృతి చేత బంధింపబడతావు, ఆత్మగుణాలను నువ్వు అభివృద్ధి చేసుకొంటే ప్రకృతిని అతిక్రమించగలవు. ఎంతోకొంత దయ అనే గుణం లేకపోతే, ఎంతోకొంత కరుణ అనే గుణం లేకపోతే వాడిని రంపం పెట్టి కోసేసినా వాడికి భక్తిభావన రాదు. వాడి హృదయంలో దయాభావన, తోటి మానవుడి పట్ల ప్రేమ, ఆప్యాయత ఎంతో కొంత లేదు అనుకోండి వాడు ఎన్ని చేసినా వాడికి భక్తి మటుకు కలుగదు. భక్తి అంటే ఈశ్వరుడిపట్ల మనకు ఉన్న మానసిక అనుబంధాన్నే భక్తి అంటారు. అరుణాచలేశ్వరుడితో చలంగారు అంటారు నువ్వు నన్ను లోపలకు లాక్కోవాలి, నువ్వు నన్ను లోపలకు లాక్కోకపోతే నా తెలివితేటలు ఉపయోగించుకొని, నేను చదివిన చదువులు ఉపయోగించుకొని నీ సమీపంలోనికి రాగలనా అరుణాచలేశ్వరుడా, నేను రాలేను. నువ్వు నా హృదయంలో ఉన్నప్పటికీ నీ దయ కనుక నాకు లేదు అనుకో నువ్వు

ఎంతోదూరాన ఉన్నట్లు నాకు అనిపిస్తుంది. మనకు పూర్తిగా వాసనాక్షయం అవ్వకుండా ఆత్మజ్ఞానం కలుగదు. వాసనను తొలగించుకోవటానికి మనం ఎంత సాధన చేసినా గురుకృప లేకపోతే ఆ వాసన నశించదు. ఈశ్వరుని యొక్క దయలేకపోతే మనం ఎంత ప్రయత్నం చేసినా కనీసం సిగరెట్ కాల్చే అలవాటులోనుండి కూడా బయటకు రాలేము. ఈ అలవాట్లలో నుండి మనం విడుదల పొందాలి లేకపోతే ఈ అలవాట్లే మనకు రాబోయే జన్మకు కారణాలు అవుతాయి. మనిషి అనుభవించే ప్రతీభోగం కూడా రోగం కింద మారిపోతుంది. ఇప్పుడు మనం అనుభవించే భోగాలే రాబోయే జన్మలలో రోగాల కింద వస్తాయి. ఈ భోగాలు, రోగాలు, అశాంతి, భయం, ద్వేషాలు, ఇష్టాలు ఇవి అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మాయ అంతా మనస్సులోనే ఉంది. ఈశ్వరుని దయలేకుండా అందులోనుండి నీవు విడుదల పొందలేవు. ఈశ్వరుడి యొక్క శక్తిని, ప్రేమను ఆయన మనకు చూపిస్తే మనం రుచి చూడగలము గాని లేకపోతే మనకు సాధ్యం కాదు. ఒక చెయ్యితో రెండో చెయ్యిని ముట్టుకొంటే ఆ స్వర్శ ఎలా తెలుస్తుందో అలాగ ఈశ్వరుని దయ మన హార్ట్‌ను టచ్ చేస్తున్నట్లు మనకు తెలుస్తూ ఉంటుంది. ఇప్పటి వరకు దేవుడు లేడు అనుకొన్నాము కాని ఆ ప్రభువు ఎంత సజీవంగా ఉన్నాడు అని అప్పుడు మనకు అనిపిస్తుంది. ఆయన మూడు అవస్థలను చూస్తున్నాడు, మనం నిద్రపోతున్నప్పటికి ఆయన మెలకువగానే ఉన్నాడు, ఆయన సర్వసాక్షి, ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. మనం బయట ఉన్న మనుషులకీ, బయట ఉన్న సమాజానికి, బయట ఉన్న దేవతలకు దూరం అవ్వవచ్చుకాని సత్యవస్తువు మన హృదయంలో ఉంది, దానిలో నుండి మనం వేరుపడలేము. ఏనాటికయినా మనంకాని దానిలో నుండి సెపరేట్ అవ్వగలం గాని మనం ఏదిగా ఉన్నామో దానిలో నుండి సెపరేట్ అవ్వలేము. ప్రపంచం అంతా మానసిక అనుబంధాలే. స్నేహాలు, విరోధాలు, చుట్టరికాలు ఇవిఅన్నీ మానసిక అనుబంధాలే. ఒక్క సత్యవస్తువు తప్పించి అన్నీ మనస్సు యొక్క కల్పితాలే. మనస్సును తీసి ఒక ప్రక్కన పెడితే, దానిని చంపేస్తే ఏమీ లేదు.

జ్ఞానికి, అజ్ఞానికి పెద్దతేడా ఏమీలేదు. జ్ఞాని హృదయంలో ఆనందం ఉంది, అజ్ఞాని హృదయంలో కూడా ఆనందం ఉంది. జ్ఞాని హృదయంలో ఉన్న ఆనందం జ్ఞాని చేతికి అందుతూ ఉంటుంది, అజ్ఞాని హృదయంలో ఉన్న ఆనందం వాడికి అందదు అంతే తేడా

కాని అక్కడ ఏముందో ఇక్కడా అదే ఉంది. భగవాన్ అంటూ ఉండేవారు నా హృదయంలో ఏదైతే ఉందో అది మీలోను ఉంది, మీ హృదయంలో ఉన్నదే నాలోనూ ఉంది. నా హృదయంలో ఉండి అది మీ హృదయంలో లేకపోతే ఆ వస్తువు నిజంకాదు. ఒకకాలంలో ఉండి మరొక కాలంలో లేకపోతే, ఒక అవస్థలో ఉండి మరొక అవస్థలో లేకపోతే అది నిజం కాదు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఏ చైతన్యం అయితే ఉందో అది ఒక్కటి మాత్రమే పారమార్థిక సత్యము, మిగతావి అన్నీ వ్యవహారిక సత్యములే. షిరిడీబాబా ఏమి చెప్పారు అంటే లోకంలోని గొడవలు అన్నీ తెచ్చుకొని మనస్సును నింపుకోవటం సాధన కాదు. నీ పూర్వజన్మల నుండి ఏ గొడవలు అయితే నీవు మనస్సులో మోసుకొని వస్తున్నావో వాటిని ఖాళీ చేయటమే సాధన అంటే నీమనస్సును నీవు ఖాళీ చేసుకోవాలి, నీ మనస్సులో నుండి నీవు బయట పడాలి. ఒక ఇంటిలో నుండి ఇంకో ఇంటిలోనికి వెళ్ళేటప్పుడు ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతాము అలాగ నీ మనస్సును ఖాళీ చేసుకోవాలి, అదే సాధన. అప్పుడు ఇంక నీకు పునర్జన్మలు లేవు. మనస్సును ఖాళీ చేసుకొన్నప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. శరీరానికి చావు వస్తోంది అనుకోండి ఏదో పోగొట్టుకొంటున్నాము అని కూడా మీకు అనిపించదు. కొంతమంది పనిచేయటం మానివేసి, డ్యూటీ చెయ్యటం మానేసి ఏవో పిచ్చి మాటలు చెపుతూ ఉంటారు, వారు ఇహానికి పనికిరారు, పరానికి పనికిరారు, అటువంటివారితో ఒకవేళ నీకు స్నేహాలు ఉంటే వాటిని తగ్గించుకోమని చెప్పారు. కొంతమంది ఏవో నాలుగు పుస్తకాలు చదువుతారు, మాకు జ్ఞానం వచ్చేసింది అనుకొంటారు. నాకు జ్ఞానం వచ్చేసింది అని ఎవరు అనుకొంటున్నారు? జ్ఞాని అలా అనుకోడు, మనస్సే అలా అనుకొంటుంది. అంటే అక్కడ మనస్సు ఉంది. మనస్సు ఉంటే అజ్ఞానం ఉందనే గుర్తు. నాకు తెలుసును, నాకు తెలియదు, నేను పుట్టాను, నేను చనిపోతున్నాను ఇవన్నీ కూడా మనస్సులో వచ్చే గొడవలు, ఇదంతా కూడా మనస్సు యొక్క ప్రకోపం, మనస్సులో ఉన్న దుమ్ము. నీ మనస్సును నీవు బంగారం అనుకొంటున్నావు ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? మనస్సులో ఉన్నది అంతా డస్టు. ఇది ఎందుకు పనికిరానిది అని నీకు తెలిస్తేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. దైనందిన జీవితంలో మనకు అనుకూలమైన సంఘటనలు, ప్రతికూలమైన సంఘటనలు రెండూ జరుగుతూ ఉంటాయి. మనం ఎటువంటి

వారము అంటే, మనస్థాయి ఎంత దిగజారిపోయింది అంటే మనకు ఇష్టంలేని సంఘటన ఏదైనా జరిగితే దేవుడే లేడు అనేసుకొంటున్నాము. ఆ ఇష్టంలేని సంఘటన నీ మంచి కోసమే క్రియేట్ చేసాడు అన్న సంగతి నీకు అనుభవంలోనికి వచ్చాక దేవుడు ఎంత మంచివాడు, గాడ్ ఈజ్ గ్రేట్ అని అప్పడు నీకు తెలుస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు, దానినే కొంతమంది రాముడు అంటున్నారు, కొంతమంది అల్లా అంటున్నారు, కొంతమంది యెహోవా అంటున్నారు కాని ఉన్న వస్తువు ఒక్కటే. బాబాకు కుల, మత, జాతి బేధం లేదు. ఆయన మనుషులకు ఎంత ప్రేమగా అన్నం పెట్టేవారో, జంతువులకు కూడా అలాగే పెట్టేవారు. ఆయన అన్నం తెచ్చుకొని అక్కడ పెట్టుకొంటే ఏ పిల్లి అన్నా ముట్టుకున్నా, కుక్క తిన్నా కూడా మిగిలిన ఆహారం ఆయన తినేసేవారు, అది కుక్క ప్రసాదం, పిల్లి ప్రసాదం అనేవారు, మనమైతే ఏవగించుకొంటాము. మనకు, జంతువుకు తేడా ఏముంది తోలు ఒక్కటే తేడా. మనకు జ్ఞానం రావటానికి ఒకటే ఉపాయం ఉంది. మనం ఇతరులను మీరు ఎవరు, వారు ఎవరు, వీరు ఎవరు అని ఇలా ప్రశ్నిస్తూ ఉంటాము. వారు ఎవరు, వీరు ఎవరు అని ప్రశ్నించేబదులు నేను ఎవడను? అనే ప్రశ్న వేసుకొంటే నాకు జ్ఞానం కలుగుతుంది. మనం ఎంతసేపు వారు ఎవరు? వీరు ఎవరు? అనే విచారణలో ఉంటాము, అదే నేను ఎవడను? అనే ప్రశ్న వేసుకొంటే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మనం నోటితో మాట్లాడేమాట, చేతితో చేసే పని, మనస్సులోకి వచ్చే సంకల్పం ఈ మూడింటికి సమన్వయం ఉండాలి. వాక్కు కాలుష్యం ఉండకూడదు. మనం మాట్లాడేటప్పడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. సబ్జక్టు మనం చెప్పవచ్చు, ఆ సబ్జక్టు చెప్పేటప్పడు కూడా ఇతరులకు నేర్చుకోవాలనే బుద్ధి కలగాలి. అంతేగాని వారికి నొప్పి కలిగేలాగ చెప్పకూడదు. చెప్పేవారికి వినేవారి మీద ఎంతో కొంత ప్రేమ ఉండాలి, ఆప్యాయత ఉండాలి. మీకుంటుంబ సభ్యుల మీద మీకు ఎంత ఇష్టం ఉందో అదే ఇష్టం పరమేశ్వరుడి మీద మీకు వస్తే మీకు జ్ఞానం వచ్చేస్తుంది. ఈశ్వరుడి మీద మనకు ఇష్టం కుదరాలి, భక్తి కుదరాలి, ప్రేమ కుదరాలి. దానికి మనం ఎంతో కొంత పుణ్య కర్మ చేసి ఉండాలి. పుణ్యకర్మలు చేస్తేనేగాని మనకు పరమేశ్వరుడి మీద భక్తి కలుగదు, అక్కడ మనస్సు నిలబడదు.

మనం గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపు వలన మనకు దేహాభిమానం

పెరుగుతుంది, అహంకారం పెరుగుతుంది. మనం గుర్తింపులు కోరుతూ ఉంటే అనాత్మ యందు ఆత్మబుద్ధి ఎక్కువగా కలుగుతూ ఉంటుంది, మనం కానిదానిని అవును అనుకొంటాము, మనస్సు బాహ్యముఖానికి విజృంభిస్తూ ఉంటుంది. కొంతమంది ఇంట్లో పనిచేసి గుర్తింపుకోరుకుంటూ ఉంటారు, బోలెడంత చాకిరి చేస్తున్నాము ఎవరూ గుర్తించటం లేదు అంటారు. అలా గుర్తించకపోవటం మనకు మంచిది. ఒకవేళ గుర్తించినా వారి అహంకారమే, గుర్తించకపోయినా వారి అహంకారమే. మనకు మోక్షాన్ని ఇచ్చేవాడు నారాయణుడు, మనకు ఆధారంగా ఉన్నవాడు నారాయణుడు, ఆయనే జ్ఞానదాత, ఆయనే మన అహంకారానికి కోత, ఆయనే మనలో అంతర్యామిగా ఉన్నాడు, మనం నోటితో మాట్లాడే మాటకు, చేతితో చేసే పనికి, మనకు వచ్చే తలంపులకు సాక్షిగా ఉన్నాడు, వాటిని రికార్డు చేస్తున్నాడు, ఆయన గుర్తించినప్పుడు ఇంక ఈ బాహ్యమైన మనుషులు గుర్తిస్తే ఏముంది, గుర్తించకపోతే ఏముంది. మన స్వరూపాన్ని విడిచిపెట్టి మనం ఎంతదూరం అయితే వెళ్ళిపోయామో మరల అంత కష్టపడితేనేగాని, అంత సాధన చేస్తేనేగాని మరల మనం వెనక్కి రాలేము. దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని వచ్చే తలంపులను తగ్గించుకొంటే, మనస్సును కేంద్రంగా పెట్టుకొని వచ్చే ఉద్రేకాన్ని రెడ్యూస్ చేసుకొంటే అప్పుడు నీకున్న ప్రేమ, అనురాగం ఒక జాతితోటి, ఒక కులంతోటి, ఒక మతంతోటి సంబంధం లేకుండా విశ్వవ్యాప్తమవుతుంది. షిరిడీ బాబాకు ఈమధ్య చాలా మంది దేవాలయాలు కడుతున్నారు కారణం ఏమిటి అని ఈ మధ్య ఒకరు అడిగారు. బాబాకు ఒక కులంతోటి కాని, ఒక మతంతోటి కాని, ఒక జాతితోటి కాని, ఒక ప్రాంతంతోటి కాని ఏమీ తాదాత్మ్యం లేదు, ఆయన చైతన్యముతో తాదాత్మ్యము పొందటమే కాదు, అది తానై ఉన్నాడు. ఆయనది ఏ కులమో, ఏ మతమో, ఏ ప్రాంతమో ఎవరికీ తెలియనివ్వలేదు. కులమతాలతో తాదాత్మ్యం లేకపోతే వాడి ప్రేమ విశ్వవ్యాప్తం అవుతుంది. మనలో అంతర్యామిగా ఉండి మన బుద్ధిని నడిపేవాడు ఆయనే. నీ బుద్ధి విశాలం అవ్వాలంటే ద్వేషం వలన బుద్ధి విశాలమవ్వదు, జ్ఞానం వలన విశాలమవు తుంది, ప్రేమ వలన విశాలమవుతుంది, శాంతి వలన విశాలమవుతుంది. కొంతమందికి పని అంటే ఇష్టం ఉండదు, తోటి మనిషిని ప్రేమించరు, పనిపట్ల గౌరవం ఉండదు, బాధ్యత ఉండదు. కొంతమంది ఈజీ లైఫ్‌కు అలవాటుపడి సన్యాసం పుచ్చుకొంటారు. మీరు ఏ

ఆశ్రమంలో ఉన్నా అంటే మీరు సన్యాసాశ్రమంలో ఉన్నా, గృహస్థాశ్రమంలో ఉన్నా మీ డ్యూటీ మీరు చేయాలి, ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టకూడదు. మనస్సు భగవంతుడి పాదాలయందు ఉండాలి, మీ చేతులు పని మీద ఉండాలి. అలా ఉంటే మీ మనస్సు నెమ్మదిగా పక్కానికి వచ్చి నెమ్మదిగా హృదయంలో లయమవుతుంది. మన హృదయంలో ఉన్న నారాయణుడు ఎంత పవిత్రంగా ఉన్నాడో అంత పవిత్రత మన మనస్సుకు వచ్చినప్పుడు మనస్సు వెళ్ళి హృదయంలో లయమవుతుంది, అప్పుడు కదా నీవు ప్రకృతిలోనుండి బయట పడేది, పునర్జన్మలో నుండి బయటకు వచ్చేది. అయితే ఇంటిలో నుండి పారిపోయినంత తేలిక కాదు మనస్సులో నుండి పారిపోవటం. మనం కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా మన మనస్సు మన కూడా వచ్చేస్తుంది. అందుచేత మనస్సులో నుండి విడిపోవటం అంత తేలిక కాదు. దానికెంతో ప్రయత్నం ఉండాలి, సాధన ఉండాలి, ఈశ్వరుని యొక్క కృప ఉండాలి, సజ్జన సాంగత్యం ఉండాలి. మన హృదయంలో ఉన్న శాంతిసాగరంతో ఎవడికైతే తాదాత్మ్యం ఉందో వాడి ఒక్క మాట చాలు, ఒక్క చూపు చాలు, వాడి మౌనం చాలు మీరు బాగుపడటానికి, మీ చైతన్యస్థాయి పెరగటానికి. జ్ఞాని యొక్క మౌనం మీలో ఎంతో మార్పు తీసుకొని వస్తుంది. మీరు ప్రయత్నం చేసి, ప్రయత్నం చేసి తీసుకొని రాలేని మార్పు జ్ఞాని యొక్క మౌనం తీసుకొనివస్తుంది. జ్ఞాని యొక్క మౌనం అంత మహత్తరమైనది. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఆయనే మన యజమాని, పని అంతా ఆయనే చేస్తున్నాడు, వాడి సంకల్పాన్ని బట్టే సృష్టి అంతా నడుస్తోంది, వాడికి తెలియకుండా ఏదీ జరగదు. కాని మనం ఏదో చేస్తున్నాము, అది మన వలననే అవుతోంది అని ఊహించుకొంటున్నాము, దాని వలన అహంభావన పెరుగుతుంది. వ్యక్తిభావన పెరుగుతుంది, వేరుబుద్ధి పెరుగుతుంది, అక్కడనుండి మన పతనం ప్రారంభమౌతుంది. నేను ఎవరినయితే చంపి పోగులుపెట్టి ఉంచానో వారినే నువ్వు చంపటం, అంతకంటే ఏమీ లేదు, చేతులు ఆడించు సరిపోతుంది అని గీతలో భగవంతుడు అర్జునుడితో చెప్పాడు. ఒకవేళ మీ జీవితంలో మీరు ఏదైనా సాధించినట్లుగా మీకు కనబడినా అది భగవంతుడు సాధించి అక్కడ పెట్టాడు, అది మనకు తెలియక నేను సాధించాను, నేను సాధించాను అని మీరు అనుకొంటున్నారు. మనం ఏమి సాధించగలము? మన తెలివి ఎంత? మన

సాధన ఎంత?

కొంతమందికి జపం అంటే చాలా ఇష్టం, నామం విడిచిపెట్టరు. వివేకానందుడు శరీరం విడిచిపెట్టే టైములో కూడా ఆయన చేతిలో దండ ఉంది. వారు సిద్ధపురుషులు అయినప్పటికీ, వారికి జ్ఞానం ఉన్నప్పటికీ ఆ పరమేశ్వరుడిమీద ఉన్న ప్రీతి కొలది చివరి శ్వాసవరకు నారాయణ స్మరణ చేస్తూనే ఉన్నారు. వారికి అన్నీ ఉండి భగవంతుడిని మరిచి పోలేదు, మనకు ఏమీ లేదు భగవంతుడిని మరిచిపోతున్నాము. మీకు ధనం ఉంటే మంచిదే, ధనం ఉందని అవసరాలు పెంచుకోకూడదు, అవసరాలు పెంచుకొనే కొలది ఈ లోకానికి బంధింపబడతాము, మన శరీరానికి, పరిసరాలకు బంధింపబడతాము. శ్రద్ధ, సహనం కలిగి ఉండమని బాబా చెప్పారు. ఒకవేళ మీకు అన్నీ ఉన్నా ఎగిరి ఎగిరి పడవద్దు, అణిగి ఉండమని బాబా చెప్పారు. మీకు ఏకారణం వలన అయినా గర్వం వస్తూ ఉంటే తగ్గించుకో మని చెప్పారు, వినయాన్ని పెంచుకోమని చెప్పారు. వినయాన్ని పెంచుకొంటే బాగుపడతారు. వినయం పెరిగే కొలది మీ మాటకు, ప్రవర్తనకు సంస్కారం వస్తుంది. నీరు ఏవిధంగా అయితే పల్లానికి వెళుతుందో అదేవిధంగా వినయం ఉన్నచోటుకు జ్ఞానం వస్తుంది, సంపద వస్తుంది, మోక్షం వస్తుంది. అందుచేత వినయాన్ని ప్రాక్టీసు చెయ్యండి. ఎక్కడయితే వినయం ఉందో, ఎక్కడయితే అణకువ ఉందో వాడు ఇది నాకు కావాలి అని భగవంతుడిని ప్రత్యేకంగా అడగకుండానే వాడికి ఏది కావాలో అన్నీ భగవంతుడే సమకూరుస్తాడు, వాడి నోటితో అడిగించుకోడు. బాబా దగ్గర నుంచి మీరందరు నేర్చుకోవలసింది ఒకటి ఉంది. కొంతమంది శివుడు ఎక్కువ అని, కొంతమంది విష్ణువు ఎక్కువ అని, కొంతమంది దేవి ఎక్కువ అని అనుకొంటారు. మనుషులలో ఎలా బేధం చూడలేదో, కులమతాలలో బేధం ఎలా చూడలేదో అలాగే దేవతలలో కూడా ఇసుమంతయు బేధం చూడనివాడు షిరిడీ సాయిబాబా. దేవతలందరినీ ఆయన సమానంగా చూసాడు, ఆయన సర్వదేవతా స్వరూపుడు. ఆయన హిందువులను, క్రైస్తవులను, మహమ్మదీయులను అందరినీ సమానంగా గౌరవించాడు. కొంతమంది మనుషులను చూస్తేనే దూరంగా తప్పకోండి, మా గురువు గారిని ముట్టుకోకండి, మీరు ముట్టుకొంటే వెంటనే స్నానం చేయాలి అంటారు అంటే వారి దృష్టిలో వీరు అందరు పనికిరాని వారు. బాబా దగ్గరకు కుక్కలు, పిల్లులు వచ్చేవి. వాటికి

ఎంతో ఆప్యాయంగా తిండి పెట్టేవారు, అవి తిన్న తరువాత ఆయన తినేవారు. మనం పిల్లులు, కుక్కల దాకా అక్కరలేదు మనుషులను చూస్తేనే దూరంగా ఉండండి అంటున్నాము. బాబా దగ్గరకు ధనం వచ్చి వర్షంలా కురిసినా ఆయన బిక్ష మానలేదు. మనకు కొంత ఆస్తి పెరిగితే, పదవి పెరిగితే తెలుసున్న వారిని కూడా మీరు ఎవరు? అని అడుగుతాము. బాబాకు విష్ణు సహస్రనామాలు అంటే ఇష్టం. విష్ణు సహస్రనామాలు చదవమని భక్తులను ప్రోత్సహించే వారు. పైగా ఇంకోమాట చెప్పేవారు వెయ్యి నామాలు అక్కరలేదు మీరు బాగుపడటానికి విష్ణు సహస్రనామాలలో ఒక్క నామం చాలు అని చెప్పేవారు. మీ బుద్ధిని బాగుచేయటానికి, మిమ్మల్ని సంస్కరించటానికి ఒక్క నామం సరిపోతుంది అని చెప్పేవారు. జ్ఞాని కూడా ఈశ్వరుడితో సమానం అయినప్పటికీ ఈశ్వరుడిపట్ల గౌరవం కలిగి ఉంటాడు, అది జ్ఞాని యొక్క వైభవం. జ్ఞానం గురించి పుస్తకాలలో చదివితే తెలియదు, మనం జ్ఞానిని చూసి నేర్చుకోవాలి. జ్ఞాని సన్నిధానంలో జ్ఞానం యొక్క విలువ, జ్ఞానం యొక్క వైభవం మనకు తెలుస్తుంది. ఎన్ని ఉన్నా శాంతి లేనివాడికి సుఖం లేదు అందుచేత మనం శాంతిని జాగ్రత్తగా కాపాడుకోవాలి, శాంతిని పోషించుకోవాలి. బాహ్యంగా జరిగే సంఘటనల ప్రభావం మన మనస్సు మీద వేసుకొని మనం శాంతిని పోగొట్టుకోకూడదు. బాహ్యసంఘటనల ప్రభావం మనస్సు మీద పడకుండా చూసుకుంటే మనం శాంతిగా ఉండగలుగుతాము. ఎక్కడ శాంతి ఉంటే అక్కడ సుఖం ఉంది, శాంతి గలవాడు మాత్రమే సుఖి అవుతాడు. జ్ఞాని దేనిని మనస్సుతో ముట్టుకోడు, జ్ఞానికి కర్తృత్వభారం ఉండదు, అందుచేత వాడికి దుఃఖం ఉండదు. మనం మూడు ఋణాలు తీర్చుకోవాలని భారతీయ సంస్కృతిలో పెద్దలు చెపుతారు. మీకు ఇష్టమైన దేవతారూపాన్ని నిరంతరం ఆరాధిస్తూ ఉంటే దేవఋణం తీరుతుంది. మన భారతీయఋషులు ఎంతో కష్టపడి వారి అనుభవాన్ని తీసి ఎంతో సాహిత్యాన్ని మనకు అందించారు, దానిని మనం అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, మన సొంతం చేసుకొంటే ఋషిఋణం తీరుతుంది. తల్లిదండ్రుల పేరు మీద మన శక్తి కొలది మంచి పనులు చేస్తే వారి ఋణం తీరుతుంది. మానవజన్మ వచ్చినందుకు ఈ మూడు ఋణాలు తీర్చుకోమని పెద్దలు చెపుతారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 07-08-05 | ఆది | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| 10-08-05<br>18-08-05 | | హైదరాబాద్ టూర్ |
| 23-08-05 | మంగళ | పాలకొల్లు యడ్లబజార్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంనందు మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| 27-08-05 | శని | భీమవరం తాడిమళ్ల వారి కేంద్రం - శ్రీరామపురం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# పాఠకులకు మనవి

**సెప్టెంబరు 2005 నుండి రమణభాస్కర్ పక్షపత్రిక "మాసపత్రిక"గా మారుచున్నది. సంవత్సర చందా రు॥ 100/-లు మాత్రమే. ఈ మార్పును గమనించగలరు. చందాదారులు ఈ క్రింది కూపన్‌ను పూర్తిచేసి పంపించగలరు.**

పేరు : ..............................................................................................

తండ్రి/భర్త/సంరక్షకుడు : ..............................................................................

డోర్ నెం. : ..............................................................................................

వీధి : ..............................................................................................

ఊరు : ..............................................................................................

పిన్ కోడ్ : ........................................... జిల్లా ...........................................

డి.డి./యం.ఓ. నెం. : ..............................................................................

**కూపన్ పంపవలసిన చిరునామా :**


**బి. మల్లిఖార్జునరావు**

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, పోడూరు మండలం, ప॥గో॥ జిల్లా, ఆం.ప్ర., ☎ 9247104551



దిıı 04–07–05న పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపములో అల్లూరి సీతారామరాజు 108వ జయంతి సందర్భంగా రుద్రరాజు సుందరరామరాజు గారిని సత్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు



దిıı 04–07–05న పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపములో అల్లూరి సీతారామరాజు 108వ జయంతి సందర్భంగా గాదిరాజు రామభద్రరాజు (సుబేదర్ రాజు) గారిని సత్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు